## క్లుప్తంగా

### యోగా పోటీలకు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని గురురాజా స్కూల్ క్రీడాకారులు రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి గురువారం తెలిపారు. యోగా అసోషియేషన్ ఆధ్వర్యంలో ఆళ్లగడ్డలో నిర్వహించిన యోగా ఎంపిక పోటీలలో జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా వారిని క్రీడా మెడల్స్‌తో అభినందించామన్నారు. ఈనెల 6, 7వ తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లా ద్వారకా తిరుమలలో జరిగే రాష్ట్ర స్థాయి యోగా చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు రాజు, పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

### క్రీడా దుస్తుల పంపిణీ



విద్యార్థులకు క్రీడాదుస్తులను పంపిణీ చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని టెక్కె మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు 30 జతల క్రీడా దుస్తులను పట్టణానికి చెందిన మధుసూదనరెడ్డి అందజేశారు. సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా మధుసూదన్‌రెడ్డి తండ్రి నాగిరెడ్డి జ్ఞాపకార్థం దుస్తులు అందజేసినట్లు హెచ్ఎం ఖాదర్ ఉశేన్, అసిస్టెంట్ హెచ్ఎం షఫత్‌తుల్లా తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేవేంద్ర, వ్యాయామ ఉపాధ్యాయుడు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### యూరియా బ్లాక్‌లో అమ్మితే కఠిన చర్యలు

శిరివెళ్ల: యూరియాను బ్లాక్‌లో అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ సుధాకర్ హెచ్చరించారు. గురువారం ఏఓ కార్యాలయంలో ఎరువుల దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల అమ్మకాలపై విజిలెన్స్ నిఘా పెట్టిందన్నారు. రైతులకు అవసరమైన యూరియా సరఫరా అవుతుందన్నా రు. ఎమ్మార్పీకే ఎరువులను విక్రయించాలన్నా రు. ఎవ్వరైన కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని, ఎరువుల అమ్మకాలు, నిల్వలను ఎప్పటికప్పుడు రికార్డులలో చూపించాలన్నారు. పంటకు తగిన విధంగా యూరియాను వాడాలని రైతులకు సూచించారు. కాంప్లెక్స్ ఎరువులతో కూడా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.

### అలరించిన పద్య పఠనం పోటీలు



తెలుగు పద్యాలు ఆలపిస్తున్న బాలిక

నంద్యాల (వ్యవసాయం): కళారాధన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో గురువారం వివేకానంద ఆడిటోరియంలో నిర్వహించిన పద్యపఠనం పోటీలు అలరించాయి. 'మాతృభూమికి కళార్చన'పేరుతో జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో పద్య పఠనం పోటీల్లో 110 మంది బాలలు పాల్గొన్నారు. రాగయుక్తంగా పద్యాలాపనతో అలరించారు. 40 మంది చిన్నారులు ఆకట్టుకునే హావభావాలతో పద్యాలు ఆలపించారు. న్యాయ నిర్ణేతలుగా సుజాత, చంద్రహాసరెడ్డి, గోపాల కృష్ణ, కమలాకర్, నీలకంఠమాచారి, ప్రసాద్ వ్యవహరించారు. టౌన్ హాల్ ప్రాంగణంలో శుక్రవారం తెలుగు, హిందీ, ఆంగ్ల భాషలలో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాలలో చక్కటి చేతి రాత పోటీలు నిర్వహిస్తున్నారు. లైన్స్‌క్లబ్ సభ్యులు నాగరాజు, సుబ్బారావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### సర్వేను త్వరగా పూర్తి చేయండి



కొలతలను పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ

శిరివెళ్ల: గ్రామాలలోని ఇంటి కొలతలను త్వరగా పూర్తి చేయాలని డీఎల్‌డీఓ శివారెడ్డి సూచించారు. గురువారం కామినేనిపల్లె, కోటపాడులలో స్వామిత్వ కింద జరుగుతున్న ఇంటి కొలతల సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలో మొదటి విడతగా స్వామిత్వ సర్వేకు 6 గ్రామ పంచాయతీలు ఎంపికయ్యారన్నారు. ఆయా గ్రామాలలో సిబ్బంది ఇళ్లు, ఇంటి ఖాళీ స్థలాలను కొలుస్తున్నారన్నారు. సర్వే పూర్తిగానే యజమానులకు స్థలం, ఇంటి హక్కు పత్రంను అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



పెచ్చులూడుతున్న కార్యాలయ పైకప్పు



వర్షానికి నెమ్మెక్కిన గోడలు



ఇరుకిరుగుగా ఉంచిన వస్తువులు

# కార్యాలయానికి అస్వస్థత



మలేరియా విభాగం కార్యాలయం

ప్రజలు మలేరియా బారిన పడి మృత్యువాత పడకుండా చర్యలు తీసుకోవాల్సిన ఉండాల్సిన భవనం ఇది. శిథిలావస్థకు చేరిన ఈ కార్యాలయంలో జిల్లా మలేరియా అధికారితో పాటు 10 మంది విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై పదహైదు నెలల అయినా ఈ కార్యాలయానికి మరమ్మతులు చేపట్టలేదు. జేసీ బంగ్లాకు, ఎస్పీ కార్యాలయానికి మధ్య ఆర్అండ్‌బీ భవనంలో కొనసాగుతున్న కార్యాలయానికి సరైన సౌకర్యాలు లేవు. ఇటీవల కార్యాలయంలోని పైకప్పుకు చెందిన సిమెంట్ పెక్కులు సిబ్బంది విధులు నిర్వహిస్తున్న సమయంలోనే కిందపడ్డాయి. దీంతో కార్యాలయంలో విధులు నిర్వహించేందుకు భయభ్రాంతులకు గురతున్నారు. భవనంలో సరైన బందపరపు లేకపోగా చిన్న వర్షానికే గోడలన్నీ నెమ్మెక్కి చెమ్మగా మారుతున్నాయి. కార్యాలయంలో సిబ్బందికి అవసరమైన వస్తువులు, కంప్యూటర్ పరికరాలతో పాటు ఇతర సామగ్రి నిల్వ ఉంచుకునేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గ్రామాల్లో పిచికారీ చేసేందుకు వచ్చే అబేట్, పైరిత్రం వంటి కీలకమైన మందులను భద్రపరచడం కష్టతరమైంది. కార్యాలయానికి సొంత భవనం లేదని, కార్యాలయ మరమ్మతులకు రూ. 18 లక్షలతో ప్రతిపాదనలు పంపామని జిల్లా మలేరియా అధికారి చంద్రశేఖరరావు తెలిపారు. నిధులు మంజూరు అయిన వెంటనే భవనాన్ని బాగుచేసే చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. - గోస్పాడు

### వేలం పాటలో ఆలయానికి ఆదాయం

నంద్యాల (వ్యవసాయం): పట్టణంలోని శ్యామకాల్వ వద్దన్న శ్రీ ప్రథమ నందీశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించిన బహిరంగ వేలం పాటలో అత్యధిక ఆదాయం లభించినట్లు ఈవో రామానుజన్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయానికి సప్లయర్ సామాన్లు వేలం పాటలో సంవత్సరానికి రూ. 10 లక్షలు, అదేవిధంగా ఆలయానికి పూల డెకరేషన్ లైటింగ్ వేలంపాటలో రూ. 15.10 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు.

### 6న మండల సర్వ సభ్య సమావేశం

శిరివెళ్ల: ఈ నెల 6వ తేదీన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివ మల్లేశ్వరప్ప గురువారం తెలిపారు. ఎంపీపీ నాయక్ వసీం అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో గ్రామీణాభివృద్ధి, తాగునీరు, సాగునీరు, విద్యుత్, ఉపాధి, వైద్యం, రవాణా, వ్యవసాయం, పంచాయతీ రాజ్ తదితర శాఖలపై చర్చ జరుగుతుందన్నారు. ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు విధిగా సమావేశానికి హాజరు కావాలన్నారు.

## నెల రోజులుగా విధులకు దూరం.. అయినా జీతం

• గృహ నిర్మాణ శాఖ కార్యాలయంలో అంతే!



నంద్యాల అర్బన్ గృహనిర్మాణశాఖ కార్యాలయం

బొమ్మలసత్రం: నంద్యాల గృహ నిర్మాణ శాఖ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ నెల రోజులుగా విధులకు దూరంగా ఉన్నా జీతం తీసుకోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. నంద్యాల పట్టణానికి చెందిన ఓ మహిళ శిరివెళ్ల మండల కేంద్రంలోని హౌసింగ్ కార్యాలయంలో గత ఎనిమిదేళ్లుగా కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేశారు. అయితే గత నెల ఆమెను నంద్యాలకు బదిలీ చేశారు. నంద్యాల అర్బన్‌కు సంబంధించిన డీఈ కార్యాలయంలో విధులు నిర్వహించాల్సి ఉంది. కాగా లబ్ధిదారులు సమాచారం కోసం వెళ్లగా ఆపరేటర్ ఇక్కడ లేరని, మున్సిపల్, సచివాలయంలో విధులు నిర్వహిస్తున్నారని అక్కడి సిబ్బంది బుకాయిస్తూ వచ్చారు. వారు చెప్పిన కార్యాలయాలకు వెళ్లి విచారించగా అక్కడ కూడా లేరని తేలింది. విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లగా.. అర్బన్ హౌసింగ్ కార్యాలయంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ గత నెలలో ఒక్క రోజు కూడా కార్యాలయంలోని అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం చేయలేదని గుర్తించారు. ఎక్కడ విధులు నిర్వహించినా నెలలో ఒక్కసారైనా సంతకం చేయాల్సి ఉంది. సిబ్బంది రిజిస్టర్‌లో ఆమె పేరు ఎదురుగా అంతా ఖాళీగా దర్శనమిస్తోంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు గుర్తించి విచారణ చేపట్టారు. ఆమెకు జీతం మంజూరు చేసిన డీఈ విజయ్‌బాబ్‌ను వివరణ కోరుతూ పీడీ శ్రీహరి గోపాల్ మెమో జారీ చేసినట్లు తెలుస్తోంది.

### దివ్యాంగురాలికి చక్రాల కుర్చీ అందజేత

నంద్యాల (వ్యవసాయం): పట్టణంలోని 25వ వార్డులో నివసించే దివ్యాంగురాలు ప్రభావతికి జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చక్రాల కుర్చీ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ.. ఆమెకు పెన్షన్ మంజూరయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు రమణయ్య, ఏవీఆర్ ప్రసాద్, రామకష్టుడు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఫర్హానాకు డాక్టరేట్

మహానంది: గాజులపల్లె గ్రామానికి చెందిన ఫర్హానాకు శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య ఆధ్వర్యంలో భౌతిక శాస్త్రంలో ఫిజికల్ స్టడీస్ ఆన్ ద ప్రాపర్టీస్ ఆఫ్ ఏఐ డోప్ జెడ్ఎన్ఓ ఫిలిమ్స్ బై ఆర్ఎఫ్ మ్యాగ్నట్రాన్ స్పాటరింగ్ అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ అందుకున్నట్లు తండ్రి పఠాన్ మాలిబాషా వెల్లడించారు.

### సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ ఆంజనేయులు

శిరివెళ్ల: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అందరూ అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్రం డాక్టర్ ఆంజనేయుల నాయక్ అన్నారు. గురువారం జలిజపేటలో వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టైఫాయిడ్, మలేరియా, డెంగీ రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యాధుల లక్షణాలు కనిపించిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రాంమోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే గుమ్మనూరుపై చర్యలు తీసుకోవాలి



నంద్యాలలో నిరసన కార్యక్రమం చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి అని ఏపీ రైతు సంఘం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగరాజు, పుల్లా నరసింహ, నరసింహనాయక్‌లు డిమాండ్ చేశారు. గురువారం నంద్యాల పట్టణంలోని సాయిబాబానగర్ సెంటర్‌లో రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనంతపురం జిల్లా పామిడి, గుత్తి మండలాల్లో 5 గ్రామాల రైతుల నుంచి మూడు పంటలు పండే 2 వేల ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్ పేరుతో ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తోందన్నారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, రైతులు గ్రామ ప్రజలు కలిసి బేతాపల్లి గ్రామంలో సోలార్ కు సేకరించిన భూములను పరిశీలించేందుకు వెళ్తే గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం నోరు పారేసుకోవడం తగదన్నారు. ప్రభాకర్‌రెడ్డికి బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తామన్నారు. ఆందోళనలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్, నాయకులు చెన్నయ్య, హుసేన్‌వలి, శ్రీనివాసులుగౌడ్, సీఐటీయూ నాయకులు రత్నమయ్య, సుబ్బయ్య, వీరసేన, శ్రీనివాసులు, భాస్కర్, రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి




మాట్లాడుతున్న రామాంజనేయులు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 21 నుంచి 25 వరకు పంజాబ్, హర్యానా ఉమ్మడి రాజధాని చండీగఢ్ నగరంలో జరగబోయే సీపీఐ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు పిలుపునిచ్చారు. గురువారం సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రఘురాం మూర్తి అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు మాట్లాడుతూ.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతదేశ ఎగుమతులపై 50 శాతం సుంకం విధించి దేశ ఉత్పత్తి రంగాన్ని దెబ్బ తీస్తున్నందుకు, భారతదేశ సార్వభౌమత్వాన్ని సవాల్ చేయడంపై సెప్టెంబర్ 6న వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జరిగే నిరసన ప్రదర్శనలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. 8న రాష్ట్ర ప్రభుత్వం యూరియా ఎరువులు కొరత సృష్టించి రైతులకు సక్రమంగా పంపిణీ చేయడంలో విఫలమైనందుకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య, రాధాకృష్ణ, రాముడు, ప్రసాద్, భాస్కర్, నాగరాముడు, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు

## సత్తాచాటిన గుంటూరు జిల్లా వృషభాలు



గెలుపొందిన వృషభాల యజమానికి నగదు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు, దాతలు

కృష్ణగిరి: మండలంలోని పుట్లూరు గ్రామంలో మారెమ్మ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన అంతర్ రాష్ట్రస్థాయి న్యూకేటగిరీ బండలాగుడు పోటీల్లో గుంటూరు జిల్లా చెబ్రోలు మండలం తోటపాలెంకు చెందిన రామినేని రత్తయ్యచౌదరి వృషబాలు గెలుపొందాయి. పోటీల్లో మొత్తం 13జతల వృషభాలు పాల్గొనగా రెండో స్థానంలో మండలంలోని పెద్దొడ్డి గ్రామానికి చెందిన మొండెం సాంబశివనాయుడు వృషభాలు, మూడో స్థానంలో గోస్పాడు మండలం సాంబవరం గ్రామానికి చెందిన దూదేకుల హరీష్ ఎద్దులు, నాల్గో స్థానంలో గుత్తి మండలం ఉబిచర్ల గ్రామానికి చెందిన ఆముదాల రమేష్ వృషభాలు, ఐదో స్థానంలో ఆళ్లగడ్డ మండలం కోటకందుకూరు గ్రామానికి చెందిన గోన నరసింహారెడ్డి ఎద్దులు నిలిచాయి. గెలపొందిన వృషభాల యజమానులకు ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో దాతల సహకారంతో వరుసగా రూ.40, రూ.30వేలు, రూ.20, రూ.15వేలు, రూ.10వేలను అందజేశారు. ఎస్ఐ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

## కేఆర్ఎంబీ కర్నూలులో ఏర్పాటు చేయాలి



కేఆర్ఎంబీ చైర్మన్ బిపి.పాండే, సభ్యుడు జాన్‌గిడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: కృష్ణా రివర్ మేనేజ్‌మెంటు బోర్డును కర్నూల్లో ఏర్పాటు చేసి, రాయలసీమ రైతులకు అన్యాయం చేయకుండా సాగునీటిని అందించాలని రాయలసీమ సాగునీటి సాధన కమిటీ అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి కోరారు. గురువారం పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ పరిశీలనకు వచ్చిన కేఆర్ఎంబీ బోర్డు చైర్మన్ బీపీ.పాండే, కమిటీ మెంబర్ కెకె.జాన్‌గిడ్‌ను కలిసి వారికి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. అనంతరం రాయలసీమ రైతాంగానికి జరుగుతున్న అన్యాయాన్ని వారికి వివరించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ కృష్ణాబోర్డును కర్నూల్లోనే ఏర్పాటు చేయాలని బోర్డు చైర్మన్‌ను కోరగా రాష్ట్ర ప్రభుత్వం విజయవాడ, విశాఖపట్నంలో ఏర్పాటు చేయాలంటుందని, ఆ రెండింటిలో ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయంపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదని చెప్పారని తెలిపారు. విజయవాడ, విశాఖపట్నం లలో బోర్డు ఏర్పాటు చేస్తే ఇప్పటికే అన్యాయానికి గురవుతున్న రాయలసీమ రైతాంగానికి సాగు నీరు అందక మరింత దుర్భర పరిస్థితులను ఎదుర్కొనాల్సి వస్తుందని వారికి తెలియజేశామన్నారు. పోతిరెడ్డిపాడు నుంచి 44వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసుకునే అవకాశం ఉన్నా, ప్రస్తుతం కేవలం 30 వేల క్యూసెక్కుల నీటిని మాత్రమే సరఫరా చేస్తుండటంతో దిగువ ప్రాంతాల్లోని ప్రాజెక్టులు నిండక, రైతాంగానికి సాగు నీరు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుందూనది మీదుగా అధికంగా సాగు నీటిని తరలిస్తుండటంతో సమీపంలోని పొలాలు మునకకు గురై రైతులు నష్టపోతున్నారని చెప్పగా..అది అంతర్గత విషయమని, దాన్ని జిల్లాల్లోని అధికారులతో పరిష్కరించుకోవాలని చైర్మన్ సూచించారన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు జలచౌర్యానికి పాల్పడకుండా కేఆర్ఎంబీ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని కోరామన్నారు. తెలంగాణ రాష్ట్రం నిబంధనలను ఉల్లంఘించి విద్యుత్ ఉత్పత్తి చేస్తుండటంతో శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం వేగంగా తగ్గి పోతిరెడ్డిపాడు నుంచి నీటిని విడుదల చేసుకోలేని దుస్థితి నెలకొంటోందని వారి దృష్టికి తెచ్చామన్నారు. పోతిరెడ్డిపాడు నుంచి జలచౌర్యం జరుగుతుందని తెలంగాణ పేర్కొనటం హాస్యాస్పదంగా ఉందన్నారు. కమిటీ ఉపాధ్యక్షుడు వైఎస్.రెడ్డి, కార్యదర్శి మహేశ్వరరెడ్డి ఉన్నారు.

### బాలికలను తప్పక చదివించాలి



మాట్లాడుతున్న సీడీపీఓ తేజస్విని

శిరివెళ్ల: బాలికలను తప్పక చదివించి వారి భవిష్యత్‌కు బాటలు వేయాలని సీడీపీఓ తేజస్విని అన్నారు. గురువారం యర్రగుంట్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆడ పిల్ల చదువు- బాల్య వివాహాలపై తల్లులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మగ పిల్లలో సమానంగా ఆడ పిల్లల చదువులు కొనసాగాలన్నారు. పిల్లల భవిష్యత్ తల్లిదండ్రుల చేతిలో ఉందన్నారు. బాల్య వివాహాలు చట్ట విరుద్ధమన్నారు. పిల్లల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. పరిచయంలేని వారి వెంట ఆడపిల్లలను పంపవద్దని, వారిచ్చే ఏ పదార్థాలను తినవద్దని పిల్లలకు చెప్పాలన్నారు. పిల్లల భవిష్యత్ కోసం ఐసీడీఎస్ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలలో మహిళల కోసం ప్రత్యేక కమిటీల ఏర్పాటు జరిగాయన్నారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవాలి


నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకోవాలని రామకృష్ణ విద్యాసంస్థల అధినేత రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం రామకృష్ణ అటానమస్ డిగ్రీ కళాశాల ఆవరణంలోని వివేకానంద ఆడిటోరియంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులందరూ బాధ్యతగాయుతంగా చదువుకొని ఉపాధ్యాయులు చెప్పే విజ్ఞానాన్ని అంది పుచ్చుకోవాలన్నారు. పంచపరివర్తన అనే నినాదంతో ముందుకు వెళ్లాలని కోరారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ రోజుకు 12 గంటలు చదివేవారని, ఆ మహానాయుడి జీవిత చరిత్రలు చదివి స్ఫూర్తి పొందాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్బయ్య, అధ్యాపకులు కుమార్, డాక్టర్ లలితాసరస్వతి, హిమబిందు, మురళీధర్, సంపత్‌కుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, ఆంద్రూస్, నిర్మల జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

### ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయం చూపండి




ధర్నా నిర్వహిస్తున్న ఆటో డ్రైవర్లు

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్రం ప్రభుత్వం మహిళలకు ఉచితబస్సు కల్పించడంతో ఆటో, వ్యాన్లు, జీపు డ్రైవర్ల ఉపాధికి గండిపడిందని, ప్రత్యామ్నాయం చూపాలని ఏఐటీయూసీ నంద్యాల జిల్లా కార్యదర్శి రఘురాం మూర్తి, డివిజన్ కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. గురువారం ఆటోడ్రైవర్లతో కలిసి పెద్దఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు వచ్చాక ఇంధనం, నిత్యావసర ధరలు ఆకాశాన్నంటాయన్నారు. దీనికి తోడు పెంచిన జరిమానాలు ఆటో డ్రైవర్లకు కునుకు లేకుండా చేస్తున్నాయన్నారు. చంద్రబాబు ప్రభుత్వం పెట్టిన ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో డ్రైవర్లు రోడ్డున పడ్డారన్నారు. డ్రైవర్లకు వాహనమిత్ర పథకం ద్వారా ఆటో డ్రైవర్లకు రూ.25 వేలు ఇవ్వాలని డిమాండు చేశారు. రాబోయే రోజుల్లో ఆటో కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా ఐక్యం చేస్తూ ఉద్యమించాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



వంతెనపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు

### నెలరోజులుగా తప్పని తిప్పలు

దొర్నిపాడు: కుందూనదిలో నెల రోజుల నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో క్రిష్టిపాడు గ్రామంలో కుందూనదిపై నిర్మించిన వంతెన మునిగి పోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. గ్రామానికి చెందిన 260 హెక్టార్లు నదికి అవతలి వైపున ఉండటంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వరినాట్లు ముమ్మరంగా సాగుతుండటంతో కోవెలకుంట్ల మండలంలోని గుళ్లదూర్తి, పొట్టిపాడు గ్రామాలను చుట్టేసి వెళ్లాల్సి వస్తోంది. కేవలం కిలోమీటరు దూరంలో ఉన్న పొలాలు ఇతర గ్రామాలు తిరిగి వెళ్లే సరికి సుమారు 20 కిలోమీటర్ల దూరభారం అవుతుంది. అంతేగాక మోటార్లు కూడా నీటిలో చిక్కుకోవడంతో సాగునీటి సరఫరాకు అంతరాయం కల్గుతుంది. ఇక ఎన్నాళ్లీ కష్టాలు పడాల్సి వస్తుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

టీచర్స్‌డే శుభాకాంక్షలు
IDS SCHOOL ఉపాధ్యాయులకు, నాన్ టీచింగ్ స్టాఫ్‌కి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
సాంత్వన మల్టీస్పెషాలిటీ హాస్పిటల్
ఆళ్లగడ్డ

ఉపాధ్యాయదినోత్సవ శుభాకాంక్షలు
ప్రజ్ఞ విద్యా సంస్థల ఉపాధ్యాయులకు, నాన్ టీచింగ్ స్టాఫ్‌కి ఉపాధ్యాయదినోత్సవ శుభాకాంక్షలు
ప్రజ్ఞ విద్యా సంస్థలు
టి.బి రోడ్, ఆళ్ళగడ్డ : 94413 75638

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నంద్యాల, ఆళ్ళగడ్డ
99122 20581 (నంద్యాల)
70750 09103 (ఆళ్ళగడ్డ)
Office mail : sakshiknladvt@gmail.com